క్లుప్తంగా

ఓటర్ల జాబితా పరిశీలన



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న అధికారులు

ఉంగుటూరు: మండలంలోని ఓటర్ల జాబితాను అధికారులు పరిశీలించారు. 2002లో మొత్తం 1,93,839మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతంగా 1,33,717 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని బిఎల్వో స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

నిడమర్రు: మండలంలోని వెంకటాపురంలో అలివేలు మంగ, గోదాదేవి సహిత బాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం దసరా ముగింపు ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం అర్చకులు పెనుమల శేషాచలం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో 3వేల మంది భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ ధర్మకర్త నాయుడు దొరబాబు తెలిపారు. ఈ అన్న సమారాధనను రిటైర్డ్ పీడీ వేగిరెడ్డి లక్ష్మణరావు కుమారుడు దొరబాబు సహకారంతో ఏర్పాటు చేసినట్లు భోజనశాల నిర్వాహకులు ఇంటి బాబి తెలిపారు. ప్రతి శనివారం ఆలయంలో భక్తులకు అన్న సమారాధనను దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష



స్వాములకు భిక్ష పెడుతున్న దాతలు

దెందులూరు: మండలంలోని పోతునూరు గ్రామపంచాయతీ పరిధిలోని ఎంతో కఠోర దీక్షతో అయ్యప్ప మాలను ధరించి దీక్ష చేస్తున్న స్వాములకు నున్న లక్ష్మణ్ పద్మావతి దంపతులు శ్రీ గౌరీ శంకర కమిటీ హాల్‌లో పోతునూరు సహకార సంఘం బ్యాంక్ అధ్యక్షుడు మోహన్‌బాబు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు గంగరాజు కొండా, ప్రసాద్, బిల్లా వీర్రాజు, బుద్ధా సాంబశివరావు, నున్న రాంబాబు, నున్న వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా గంగానమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

దెందులూరు: మండలంలోని గాలాయగూడెంలో శనివారం గంగానమ్మ అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఉత్సవంలో గాలాయగూడెంతో పాటు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అమ్మవారికి దర్శించుకుని పూజలు చేశారు.

ఐద్వా సభలను విజయవంతం చేయాలి

ఏలూరు (టూటౌన్): ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో నిర్వహించే 16వ ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామల రాణి పిలుపు నిచ్చారు. స్థానిక పవర్‌పేటలోని ఐద్వా జిల్లా సంఘాల కార్యాలయం వద్ద, గస్ బజార్ సెంటర్, గంగానమ్మ గుడిసెంటర్ వద్ద అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి, శ్యామల రాణి, ఎం అరుణ కుమారిలు శనివారం పతాక ఆవిష్కరణ చేశారు. 13వ తేదీన భారీ బహిరంగ సభ ఉంటుందని వారు తెలిపారు.

సరైన పత్రాలు లేకుంటే కేసులు

ఏలూరు టౌన్: మోటారు వాహనాలకు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుంటే కేసులు నమోదు చేస్తామని ఏలూరు ట్రాఫిక్ ఎస్సై శ్రీధర్ హెచ్చరించారు. ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణబాబు ఆధ్వర్యంలో ఏలూరు అశోక్‌నగర్, పత్తేబాద, తదితర ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన పత్రాలను పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రతి వాహనానికి రిజిస్ట్రేషన్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ పత్రాలతోపాటు డ్రైవింగ్ లైసెన్సు కూడా విధిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించటం ద్వారా ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాపాయ స్థితి నుంచి రక్షణ లభిస్తుందన్నారు. తనిఖీల్లో ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

పైడి చింతపాడులో తనిఖీలు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం పైడి చింతపాడు గ్రామంలో శనివారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేశారు. సంఘ వ్యతిరేక కార్యకలపాలపై సమాచారం తెలియజేయాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య, ఏఈఎ ఎస్ పాండురంగారావు కోరారు. గ్రామ సర్పంచ్ ముంగర తిమోతిని కలిసి గ్రామంలో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

గుంత.. అడుగేయాలంటే చింత

- భీమడోలు ఆర్టీసీ బస్టాండ్‌లో నిత్యం సమస్యలు
- ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోని బస్టాండ్
- కూర్చునేందుకు సరిపడా బెంచీలు లేవు
- ఇరుకైన బస్టాండ్‌లో గంటల కొద్దీ నిలబడే ఉండాల్సిన జనం
- పిల్లా పాపలతో దర్శనానికి వెళ్లే వారి పరిస్థితి దయనీయం



గోతుల పక్కనే బస్సులు ఎక్కుతున్న జనం



గోతుల్లో పడి అడుగుభాగం దెబ్బతింటున్న బస్సులు

భీమడోలు: భీమడోలు బస్టాండ్‌లోకి అడుగుపెట్టాలంటనే భక్తులు, జనం హడలిపోతున్నారు. కనీసం నిలబడేందుకు స్థలం లేకపోవడం, ప్రాంగణమంతా గోతులతో నిండిపోవడంతో బస్టాండ్‌లో కనీస వసతులు కొరవడడంతో అటు జనం, ఆర్టీసీ సిబ్బంది తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా ఈ బస్టాండ్ ద్వారా నిత్యం వేలాది మంది ద్వారకాతిరుమల వెంకన్నను దర్శించుకునేందుకు వెళ్లే భక్తులు కావడం గమనార్హం. బస్టాండ్ ద్వారా లక్షలాది రూపాయలు ఆర్టీసీకి, ద్వారకాతిరుమల దేవస్థానానికి సమకూరుతున్నా వసతుల కల్పనతో పాటు కనీసం గోతులుకూడా పూడ్చకుండా తాత్సారం చేస్తూ భక్తుల సహనాన్ని పరీక్షిస్తున్నారు.

జాతీయ, రాష్ట్రీయ రహదారికి కూడలిగా ఈ బస్టాండ్

జాతీయ, రాష్ట్రీయ రహదారులకు కూడలిగా ఉన్న ఈ బస్టాండ్‌లోకి వేరే జిల్లాల నుంచి వేలాదిగా వచ్చే భక్తులు, ప్రయాణికులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో రెండు శాఖలు తీవ్రంగా విఫలమయ్యాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాగునీరు, సరిపడేంత సీట్లు లేకపోవడం, సరిపడిన మరుగుదొడ్లు లేక మహిళలు, వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడడం, భక్తులకు సరైన భద్రత సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రధానంగా రాత్రి వేళల్లో వారి కష్టాలు వర్ణనాతీతం. ప్రధానంగా ఏన్నో ఏళ్లుగా బస్టాండ్‌లోని రోడ్డును పట్టించుకోకపోవడంతో భారీ గోతులతో నిండిపోయింది. దీంతో బస్టాండ్‌లోకి రావాలంటేనే భీతిల్లిపోతున్నారు. అదమరిస్తే ఏ గోతిలో పడతామోనన్న భయం వారిని వెంటాడుతుంది. పలువురు గాయాలపాలవుతున్నారు. ఈ రెండు శాఖలకు లక్షలాది రూపాయల ఆదాయం ఈ బస్టాండ్ ద్వారా సమకూరుతున్నా.. బస్టాండ్ ఆలనాపాలన పట్టించుకున్నా నాథులే కరవ్వయ్యారు.

ఐదు వేల మంది ప్రయాణం

జాతీయ, రాష్ట్రీయ రహదారులకు జంక్షన్‌గా ఉన్న భీమడోలు బస్టాండ్‌నుంచి ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి భక్తులు, ప్రయాణికులు, జనం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. సెలవుల్లో ఈ సంఖ్య రెట్టింపు ఉంటుంది. మెట్ట, డెల్టా ప్రాంతాలైన 50 గ్రామాలకు ఇదే ప్రధాన బస్టాండ్. రాష్ట్రం నలుమూలల నుంచి ద్వారకాతిరుమలకు వెళ్లేందుకు భక్తులకు ఈ బస్టాండ్ నుంచి రాకపోకలు సాగించాల్సిందే. దీంతో అటు దేవస్థానానికి, ఆర్టీసీకి లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. దీనికి తోడు బస్టాండ్ చుట్టూ ఉన్న కాంప్లెక్స్‌ల నుంచి దేవస్థానానికి అద్దెల రూపంలో లక్షల్లో వస్తుంది. కానీ లక్షల్లో ఆదాయం అందించే బస్టాండ్ నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరగడం.. దీంతో బస్టాండ్ నుంచి రాకపోకలు వారి కోసం అందుకు తగ్గట్టుగా వసతులు కల్పించకపోవడం, కనీసం ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగే పరిస్థితి లేదు. దీంతో కేవలం భక్తులు ప్యాసింజర్ బస్సుల పైనే ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనితో కనీసం గంటల తరబడి వేచిఉండే పరిస్థితుల్లో కనీసం కూర్చునేందుకు సరిపడేంత సీట్లు లేవు. దీంతో దర్శనానికి పిల్లాపాపలతో వెళ్లే తల్లిదండ్రులు నానా అగచాట్లు పడుతున్నారు. స్త్రీ శక్తి పథకంతో ఉచిత బస్సు ప్రయాణంతో మహిళల రద్దీపెరిగింది. అయితే సదుపాయాలు కల్పించకపోవడంతో దొంగలు హల్‌చల్‌చేస్తూ భక్తుల జేబులు ఖాళీచేస్తున్నారు. దీంతో వారి భద్రత పెద్దసమస్యగా మారింది. హోంగార్డును నియమించాలని భక్తులు కోరుతున్నారు.

భీమడోలు బస్టాండ్ రోడ్డును పట్టించుకోవడం లేదు



దేవస్థానం, ఆర్టీసీలకు ఆదాయమే పరమావధి. భక్తులు ఇబ్బందులు, సమస్యలు వారికి పట్టడం లేదు. కొన్నేళ్లుగా ఈ బస్టాండ్ ఆధ్వాన్నంగా మారింది. భక్తులు, ప్రయాణికులు వర్షాకాలంలో నానా అవస్థలు రెట్టింపు. వెంకన్నను దర్శించుకునే భక్తులు ఈ బస్టాండ్ నుంచి రాకపోకలు సాగించాలి. ప్రధానంగా రోడ్డు ఆధ్వానంగా ఉంది. ఇప్పటికైనా బస్టాండ్‌ను దేవస్థానం అధికారులు స్పందించి సీసీ రోడ్డు వేసి, కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం.

– ఆర్.లింగరాజు, సీపీఎం జిల్లా నాయకులు, భీమడోలు



భీమడోలు బస్టాండ్‌లో ప్రమాదకర గొయ్యి



బస్టాండ్‌లో అడుగడుగునా గోతులే



జనంతో కిటకిటలాడుతున్న బస్టాండ్

బాలికలు ఉన్నత స్థానాలకు ఎదగాలి



గణపవరం బాలికల హాస్టల్‌లో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: బాలికలు ఎందులోనూ మగవారికి తీసిపోరని, బాలికలు కష్టపడి ఉన్నత స్థానాలకు ఎదగాలని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. శనివారం గణపవరం ఎస్సీ బాలికల వసతిగృహంలో అంతర్జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగా బాలికలకు ఆరోగ్యం, విద్య, స్వయంసమృద్ధి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలంతా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని చెప్పారు. ప్రతి ఒక్కరూ చదువు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఆకు కూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో దెందులూరు విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: రెజ్లింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఏలూరు జిల్లా దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల విద్యార్థి కర్నాటి రత్నభూషణ్ 35 కేజీల విభాగంలో ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడ్లపట్ల విజయకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు తుంపాటి బాబురావు అన్నారు. ఈనెల 10న ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తూంపాటి రత్నభూషణ్ తన ప్రతిభను చాటుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని పాఠశాల గ్రంథపాలకుడు గొల్లపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుల వెంకటనారాయణ అన్నారు.

‘కోటి సంతకాల’తో నిలదీస్తాం



ఉంగుటూరు: సభలో మాట్లాడుతున్న పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబు



దెందులూరు: కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను విడుదల చేస్తున్న పార్టీ నాయకులు

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఉద్యమం
- పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, ఉన్నత ఆశయానికి గండికొడుతున్న కూటమి సర్కారు వైఖరికి వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించి నిలదీస్తామని మాజీ ఎమ్మెల్యే, పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబు స్పష్టం చేశారు. మండల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు మరడ మంగరావు ఆధ్వర్యంలో శనివారం ఉంగుటూరు దళితవాడ అంబేడ్కర్ విగ్రహం వద్ద కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పుప్పాలవాసుబాబు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసి రూ.వేల కోట్లు దండుకోవడానికి చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. దీనికి నిరసనగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. చంద్రబాబుకు అమరావతిలో రాజధాని నిర్మాణంపై ఉన్న శ్రద్ధ మెడికల్ కాలేజీలపై లేదన్నారు. అమరావతిలోని టీడీపీ నేతల భూములకు ధరలు పెంచుకొనేందుకే రాజధాని నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారని ఆరోపించారు. ఏడాదిన్నర కాలంలో తెచ్చిన రూ.లక్షల కోట్లు అప్పులు ఏంచేశారని ప్రశ్నించారు. జగనన్నకు మంచి పేరు వస్తుందనే కక్షతోనే చంద్రబాబు కుట్రపూరితంగా మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగిస్తున్నారని విమర్శించారు. అలాగే నియోజకవర్గంలో 60వేలు సంతకాలు పూర్తి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మంద జయలక్ష్మి, వీవర్సు విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు పుప్పాలగోపి, పార్టీ ముస్లిం మైనారిటి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బాజి, బూత్ వింగు రాష్ట్ర కార్యదర్శి యెలిశెట్టి పాపారావు బాబ్జి, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పెనుగొండ బాలక్రిష్ణ, గణపవరం మండల పార్టీ అధ్యక్షుడు దండు రాము, బీమడోలు మండల పార్టీ అధ్యక్షుడు రాయిపాటి సత్యశ్రీనివాస్, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు తుమ్మగంట రంగ, పంచాయతీ రాజ్ విభాగం నియోజకవర్గ ప్రెసిడెంట్ రామిశెట్టి శ్రీను, చింత కిషోర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

సైన్యంలా కదిలి సత్తా చూపిద్దాం

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉద్యమం కొనసాగించాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, వడ్డీల కార్పొరేషన్ మాజీ చైర్మన్ ముంగర సంజీవకుమార్ పిలుపునిచ్చారు. పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేందుకు, ప్రజలకు మెరుగైన వైద్యం అందజేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 17నూతన మెడికల్ కాలేజీల నిర్మాణం చేపడితే వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేసి నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రజల తరపున పోరాటం చేయాలన్నారు. శనివారం సాయంత్రం దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి క్యాంపు కార్యాలయం ఎదుట అబ్బయ్య చౌదరి సూచన మేరకు దెందులూరు నియోజకవర్గం పార్టీ అన్ని విభాగాల నాయకులు కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను విడుదల చేశారు. దెందులూరు జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. అనేక సంక్షేమ పథకాలను అందిస్తామని కూటమి నేతలు కల్లబొల్లి హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక మోసం చేశారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్ సిక్స్‌లో భాగంగా చెప్పిన ఏ ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అందించలేదన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, పార్టీ గ్రీవెన్స్ రాష్ట్ర కార్యదర్శి కట్ట ఏసుబాబు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ఏ మంచి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చేయరని విమర్శించారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయలేదన్నారు. 18 ఏళ్లు నిండిన ఆడపడుచులకు ఇచ్చిన హామీలు కూడా అమలు చేయకుండా కల్లబొల్లి మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి నాయకత్వంలో ప్రణాళిక బద్ధంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తానమ్నారు. అనంతరం కోటి సంతకాల సేకరణ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జెడ్పీటీసీ మండల సరస్వతి, ఏలూరు జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, దెందులూరు ఏఎంసి మాజీ చైర్మన్ అప్పన్న ప్రసాద్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నిట్ట గంగరాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కత్తుల రవి, జిల్లా కార్యదర్శులు కాటి సుధాకర్, డీబీఆర్‌కే చౌదరి, యువజన విభాగం జిల్లా కార్యదర్శి నేట్టూరి సాయి, కార్పొరేషన్ల రాష్ట్ర మాజీ డైరెక్టర్లు మండల కొండలరావు, ప్రభాకర్ రావు, పళ్ళెం ప్రసాద్, పెదవేగి మండలం పార్టీ అధ్యక్షులు జానంపేట ప్రసాద్ బాబు, ఎంపీటీసీ పులవర్తి దేవానంద్, పార్టీ సీనియర్ నాయకులు కృష్ణారావు, మునికుమార్, మాదల సుబ్బారావు, పెద్దిరాజు, జయరాజు, గారపాటి నాగేశ్వరరావు, కూర్మ ప్రకాష్ రావు, చల్లగొల్లతేజ, పర్వతనేని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి నాగమ్మ ఆలయ వివాదం



కైకరం ఆలయంలో కొలువైన నాగమ్మ తల్లి

ఉంగుటూరు: మండలంలోని కై కరం నాగమ్మ తల్లి ఆలయం వివాదం తిరిగి తెరమీదకు వచ్చింది. నాగమ్మ ఆలయం ప్రస్తుతం రెవెన్యూ పరిధిలో నడుస్తోంది. షష్ఠి తిరునాళ్ల వచ్చేసరికి ప్రభుత్వం ఏపార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీ వాళ్లకు సంబంధించిన వ్యక్తులు ఉత్సవ కమిటీ కింద వేసుకుని కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. 2016 నుంచి ఇలానే జరుగుతోంది. అంతకు ముందు ప్రైవేట్‌గానే గుడి కార్యకాలాపాలు మొత్తం నిర్వహించేవారు. 2016లో దేవాదాయశాఖ ఆధీనంలో చేసుకునేందుకు ప్రయత్నం మెదలైంది. ఈ క్రమంలో ధర్మకర్తగా ఉన్న అద్దేపల్లి శేషయ్య కోర్టుకు వెళ్లి స్టేటస్ కో తెచ్చుకోవడంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. అప్పటి ఆ గుడి బాధ్యతను రెవెన్యూశాఖకు ప్రభుత్వం అప్పగించింది. అప్పటి నుంచి తహసీల్దార్ పర్యవేక్షనలో నడుస్తోంది. అయితే రెవెన్యూ వారు పూర్తి స్థాయిలో నడపడం లేదని, ప్రైవేటు వ్యక్తులకు అప్ప చెబుతున్నారని, ఆరోపిస్తూ ధర్మకర్తనైన తనను ఆలయంలో పూజలు చేయనీయడం లేదని అద్దేపల్లి శేషయ్య కోర్డుకు వెళ్లి స్టే తీసుకురావడం జరిగింది. దాంతో రెవెన్యూశాఖ ఇప్పుడు కోర్టుకు వెళ్లనుంది. దాంతో గ్రామంలో ఈ ఆలయం గొడవ మళ్లీ తెరపైకి వచ్చింది. ఒకప్పుడు ఆలయం ఆదాయం అంతా ప్రైవేటు వ్యక్తులే కైంకర్యం చేసేవారనే ఆరోపణ గ్రామంలో లేకపోలేదు. దేవాదాయశాఖ స్వాధీనం చేసు కునే క్రమంలో తహసీల్దార్‌కు కలెక్టర్ అప్పజెప్పినప్పటి నుంచి రూ.69 లక్షలు ఆదాయం అమ్మవారి పేరున బ్యాంకు లో నిల్వ ఉండటం గమనార్హం.

ఆదమరిస్తే.. అంతే సంగతులు

ఆధ్వానంగా సంతమార్కెట్ రోడ్డు

భీమడోలు: మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జమమయ్యాయి. శనివారం కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. దీంతో రోడ్లపై ఏర్పడిన భారీ గోతుల్లో నీరు చేరింది. రహదారులపై రాకపోకలు సాగించే వాహనదారులు గోతుల్లో వెళ్లాలంటేనే భయపడుతున్నారు. భీమడోలు జంక్షన్ నుంచి సంతమార్కెట్ వరకు గల ఈ రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. రెండు కిలోమీటర్ల దూరంలో అడుగు అడుగునా గోతుల్లో వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కూటమి పాలనలో కొన్ని నెలల కితం సుమారు రూ.20లక్షలతో మరమ్మతుల చేసినా వేసిన రోడ్లు అనతికాలంలోనే గుంతలమయంగా మారాయి. ఈ రహదారిపై నుంచి జిల్లా నలుమూలల నుంచి భక్తులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై రాకపోకలు... ఆదమరిస్తే అంతే సంగతులు.



భీమడోలు జంక్షన్ నుంచి సంతమార్కెట్‌కు వెళ్లే దారిలో ఏర్పడిన భారీ గోతులు



సంతమార్కెట్ నుంచి భీమడోలు జంక్షన్‌కు వచ్చే దారిలో ఏర్పడిన ప్రమాదకర గొయ్యి